సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం, 3, మార్చి, 2023



విదేశీయుల సందడి

ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీ వారపు సంతలో విదేశీయులు సందడి చేశారు. 8లో



ఉపాధి కల్పన లక్ష్యం

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యమని ఉపాధి కల్పన నైపుణ్య జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. 8లో



నేడే కోనేటిరాయుని కల్యాణం

ఉపమాకలో కోనేటిరాయుని దివ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో

పెట్టుబడుల పండగ నేడే

పారిశ్రామికవర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 పెట్టుబడులు పండగ నేడే ప్రారంభం కానుంది. రూ.2 లక్షల కోట్ల కనీస పెట్టుబడులు లక్ష్యంగా అధికారంలోకి వచ్చాక మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా ప్రారంభించనున్నారు. సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరుకానున్నారు. అడ్వాంటేజ్ ఏపీ పేరుతో నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించనున్న పారిశ్రామికవేత్తలు ఎన్నో కీలక నిర్ణయాలు వెలువరించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.



సమ్మిట్ సభా వేదిక

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఏయూ మైదానం
- సమ్మిట్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- దిగ్గజ పారిశ్రామికవేత్తల హాజరుతో కీలక ముందడుగు
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఎగ్జిబిషన్

సాక్షి, విశాఖపట్నం : సుదీర్ఘమైన తీరప్రాంతం, విస్తృతమైన వనరులు.. ఎక్కడా లేని విధంగా ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ పాలసీతో పారిశ్రామికవేత్తలను రాష్ట్రం ఆకర్షిస్తున్న తరుణంలో.. ఏపీలో తమ పరిశ్రమల్ని విస్తరించేందుకు ఆహ్వానం పలుకుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జీఐఎస్–2023 సమ్మిట్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో విశాఖ వేదికగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కీలక ఎంవోయూలకు వేదికగా నిలవబోతోంది. 45 దేశాల ప్రతినిధులు, 35 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరుకానున్న సదస్సు కోసం ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఏయూ మైదానంలో సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. మిరుమిట్లు గొలిపే సభా వేదికపై


సభా ప్రాంగణంలో వివిధ దేశాల జాతీయ జెండాలు

సుమారు 30 మంది అతిథులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదిక వద్ద నాలుగు వేల మంది ప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి పక్కనే ఉన్న మిగిలిన హాల్స్‌లో 137కి పైగా స్టాళ్లతో ఎగ్జిబిషన్, 20కి పైగా బిజినెస్ సెషన్లు నిర్వహించనున్నారు. రెండు రోజుల సమ్మిట్‌కోసం ఇప్పటికే 15 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయంటే స్పందన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.


సమ్మిట్‌కు సిద్ధమైన వేదిక

చార్టర్డ్ ఫ్లైట్స్.. హెలికాప్టర్లు

సదస్సులో పాల్గొనేందుకు ముఖేష్ అంబానీ, కరణ్ అదానీ, కేఎం బిర్లా, మిట్టల్, బజాజ్, జీఎంఆర్ తదితర ప్రముఖ పారిశ్రామికవేత్తలు నేడు విశాఖకు చేరుకోనున్నారు. దాదాపు 25కి పైగా చార్టర్డ్ ఫ్లైట్స్ విశాఖలో సందడి చేయనున్నాయి. అదేవిధంగా.. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల్ని సమ్మిట్ జరుగుతున్న ఏయూ మైదానానికి తీసుకొచ్చేందుకు రెండు హెలికాప్టర్లను కూడా సిద్ధం చేశారు. వీటితో పాటు ఖరీదైన లగ్జరీ కార్లు సిద్ధంగా ఉన్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అమర్‌నాథ్, విడదల రజని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సదస్సును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023ని శుక్రవారం ఉదయం 10.15 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, వసతుల్ని పారిశ్రామిక ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రతి రంగానికి సంబంధించి మొత్తం 14 ఆడియో వీడియో విజువల్‌ని ప్రదర్శించనున్నారు. అనంతరం సంబంధిత శాఖ మంత్రులు ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో తొలిరోజు సదస్సు జరగనుంది. ఈ సదస్సు జరిగే రెండు రోజులు వివిధ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకోబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ అవకాశాలున్న 14 రంగాలను ప్రభుత్వం ఈ వేదికపై ప్రమోట్ చేస్తోంది. రెండు రోజుల పాటు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయాన్నే వేదిక వద్దకు చేరుకొని సాయంత్రం వరకూ పారిశ్రామికవేత్తలతోనే ముఖాముఖి సమావేశాలు, ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న సదస్సు విజయవంతం కావాలని మంత్రులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, విశాఖ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.


విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకట కుమారి, పక్కన ఎంపీ సత్యవతి, మంత్రి విడదల రజని




వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

ముస్తాబైన విశాఖ


విద్యుత్ వెలుగుల్లో విశాఖ నగరం

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడుల పండగకు విశాఖ నగరం ముస్తాబైంది. దేశవిదేశాల నుంచి వస్తున్న అతిరథ మహారథులకు సాదరంగా స్వాగతం పలకడానికి సర్వాంగ సుందరంగా సింగారించుకుంది. నభూతో అన్న చందంగా వైజాగ్ ప్రత్యేక అందాలను సంతరించుకుంది. ఎక్కడ చూసినా పండగ వాతావరణమే కనిపిస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్ర, శనివారాల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) జరగనుంది. సమ్మిట్ నిర్వహణ కోసం విశాలమైన మైదానంలో ఆరు జర్మన్ హ్యాంగర్స్ వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా 46 దేశాలకు చెందిన అతిరథ మహారథులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరంగా అలంకరించారు. ఓ పక్క రోడ్లు మెరుస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, డివైడర్లు సరికొత్త రంగులను పులుముకుని అందంగా అగుపిస్తున్నాయి. డివైడర్ల మధ్యలో మొక్కలు చల్లగాలులు వెదజల్లుతున్నాయి. విద్యుత్ స్తంభాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. బీచ్‌రోడ్డులో డిజిటల్ లైటింగ్ నుంచి వెలుగులు లేలేత కిరణాలను తలపించేలా ప్రసరిస్తున్నాయి. రోడ్ల పక్కన గోడలకు


ఆర్‌కే బీచ్‌లో విద్యుత్ కాంతుల్లో కొబ్బరిచెట్లు

రాష్ట్ర, విశాఖ సంస్కృతిని తెలియజేస్తూ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కూడా నిగనిగలాడుతున్నాయి. విశాఖకు విచ్చేసే ప్రముఖుల


కళకళలాడుతున్న విశాఖ నగరంలో ఓ కూడలి

హోర్డింగులు నగరంలో అనేక చోట్ల దర్శనమిస్తున్నాయి. ఇలా విశాఖ నగరం.. దేశ విదేశాల నుంచి అడుగిడుతున్న పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానం పలుకుతోంది.

న్యూస్‌రీల్

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

అరకు ఎంపీ మాధవి


సీతంరాజు సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. గురువారం ఆమె మాకవరం,వెలగలపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మద్దతు కోరారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, శరభన్నపాలెం సర్పంచ్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పెదబయలు: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పాడేరు విద్యుత్ శాఖ ఈఈ ఏవీఎస్‌ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు నుంచి పెదబయలు మీదుగా ముంచంగిపుట్టు వరకు 33 కేవీ లైన్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్లకు స్వల్ప మరమ్మతులు చేపడతామన్నారు. దీనివల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పెదబయలు మండలంలోని 23 పంచాయతీలు, ముంచంగిపుట్టులోని 23 పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

800 లీటర్ల పులుపు ధ్వంసం


స్వాధీనం చేసుకున్న వంటపాత్రలు, డ్రమ్ములు

కొయ్యూరు: మంప శివారు ప్రాంతంలో గురువారం 800 లీటర్ల పులుపును మహిళాపోలీసులతో కలిసి ధ్వంసం చేసినట్టు మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన తయారీదారులు పరారయ్యారు. డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయించినా, తయారు చేసినా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

జెన్‌కో రిటైర్డ్ అధికారికి సత్కారం


ఏడీ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో విద్యుత్ కాంప్లెక్స్ సీలేరు సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఏడీ (టెక్నికల్) చంద్రశేఖర్‌ను గురువారం పలువురు అధికారులు ఘనంగా సత్కరించారు. జెన్‌కో అధికారులు ఆయన సేవలను కొనియాడారు. విధుల పట్ల నిబద్ధత, వృత్తిలో అంకిత భావంతో రాణించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు, ఏడీ అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, సీలేరు కాంప్లెక్స్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన


సీలేరులో సీసీరోడ్లను పరిశీలిస్తున్న జేఈ జ్యోతిబాబు

సీలేరు: సీలేరు గ్రామ సచివాలయ పరిధిలో కొత్తగా నిర్మించిన సీసీరోడ్లను గురువారం మండల, పీఆర్ జేఈ జ్యోతిబాబు పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విడుదల అయిన రూ.10 లక్షల నిధులతో ఐదు రోడ్లను నిర్మించారు. వీటి నాణ్యతను జేసీ పరిశీలించారు.

మన్యంలో చలిపులి

సాక్షి,పాడేరు: మన్యంలో రాత్రి తొమ్మిది గంటల తరువాత చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు తీవ్రత తగ్గింది సూర్యోదయం 8గంటలకు అవుతోంది. అప్పటివరకు చలిగాలుల తీవ్రత ఉంటోంది. చింతపల్లిలో గురువారం 10.2 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 14 డిగ్రీలు, అరకులోయలో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఉంటోంది.


చలిమంటను కాగుతున్న యాచకులు

ఈక్రాప్ నమోదుకు రేపటి వరకు గడువు

జిల్లా వ్యవసాయాధికారి నందు

సాక్షి, పాడేరు: రబీలో పంటల సాగు చేస్తున్న రైతులంతా ఈనెల 4వతేదీ లోగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు. రబీ 2022–23కు సంబంధించి జిల్లాలో 64,467 ఎకరాల్లో రైతులు వివిధర రకాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఇంతవరకు 41,093 ఎకరాల పంటలకు మాత్రమే ఈక్రాప్ నమోదు చేసినట్టు ఆయన వివరించారు. మిగతా పంటల నమోదుకు ప్రభుత్వం ఈనెల 4వరకు గడువు పెంచిందన్నారు. ఈకేవైసీ చేసుకున్న రైతుల జాబితాను ఈ నెల8వ తేదీ నుంచి సామాజిక తనిఖీల నిమిత్తం జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు. జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సంబంధిత వ్యవసాయ అసిస్టెంట్ల దృష్టికి రైతులు తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లాలోని కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా వైఎస్సార్ యంత్రసేవ కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 115 గ్రూపులకు యంత్ర పరికరాలు పంపిణీ చేయగా, మిగిలిన 115 గ్రూపులకు యంత్ర పరికరాలు మంజూరు చేస్తామని తెలిపారు. యూనిట్ ఖరీదు రూ.15లక్షలు, 10శాతం రైతులు చెల్లిస్తే, 40శాతం సొమ్మును ప్రభుత్వం భరిస్తుందన్నారు. మిగతా మొత్తానికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. వీటికి సంబంధించి 115 గ్రూపుల రైతులు ఈనెల 7వ తేదీలోగా బ్యాంకుల్లో తమ వాటా సొమ్ముతోపాటు అదనంగా మరో 40 శాతం సొమ్మును డిపాజిట్ చేయాలని సూచించారు. యూనిట్ మంజూరైన వెంటనే ప్రభుత్వం 40శాతం సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేస్తుందని ఆయన తెలిపారు.

ఒక్కసారి లే అమ్మా.. మాట్లాడమ్మా..!

- అందరినీ కలచివేసిన చిన్నారుల దీనస్థితి
- తల్లి మృతి.. తండ్రి జైలుపాలు
- భార్యాభర్తల మధ్య చిచ్చురేపిన మద్యం మహమ్మారి
- కుటుంబంలో తీవ్ర శోకం
- గాలిమానువీధిలో ఘటన

గూడెంకొత్తవీధి: అమ్మా ఒక్కసారి లేవమ్మా.. మాట్లాడమ్మా అంటూ ఆ ముగ్గురు చిన్నారులు కన్నతల్లి మృతదేహం వద్ద విలపించడం అందరి హృదయాలను పిండేసింది. మద్యం మత్తులో తండ్రి దురాగతం వారికి కన్నతల్లిని శాశ్వతంగా దూరం చేసింది. బుధవారం అర్ధరాత్రి మొండిగెడ్డ పంచాయతీ గాలిమానువీధి గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆ కుటుంబాన్ని తీవ్ర శోకంలో ముంచేసింది.

మద్యానికి డబ్బులివ్వలేదని..

గాలిమానువీధి గ్రామానికి చెందిన గబులంగి రామచంద్రరావు, ఒడిశా ప్రాంతానికి చెందిన ఒడిశా విజయ 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అన్యోన్యంగా సాగుతున్న వీరి దాంపత్య జీవితంలో మద్యం మహమ్మారి చిచ్చు రేపింది. రామచంద్రరావు కొంతకాలంగా మద్యానికి బానిసై డబ్బులు పాడుచేస్తున్నారు. ఎన్నో సార్లు అతనికి భార్య నచ్చచెప్పింది. అయినప్పటికీ వినలేదు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మద్యం సేవించిన అతను కాఫీ గింజలు విక్రయించగా వచ్చిన సొమ్ము తనకు ఇమ్మని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు నిరాకరించిన ఆమె అక్కడి నుంచి వెళ్లి వరండాలో పడుకుంది. దీంతో అసహనానికి గురైన అతను నాటుతుపాకీతో కాల్చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు చుట్టుపక్కల వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

బిక్కుబిక్కుమని..

తల్లి మృతి చెందింది... తండ్రి జైలుపాలు కానుండటంతో ముగ్గురు సంతానం పరిస్థితి దయనీయంగా మారింది. సాఫీగా సాగుతున్న సంసారంలో అమ్మానాన్నల మధ్య చిలికి చిలికి గాలివానలా మారిన వివాదం వారికి దిక్కులేకుండా చేసింది. ముగ్గురిలో పెద్ద కుమారుడు నెహ్రూ జి.మాడుగుల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. మిగతా ఇద్దరు దారా ప్రసాద్, బారా బబ్బులు మొండిగెడ్డ మండల ప్రజా పరిషత్ స్కూల్లో చదువుతున్నారు. తల్లి మృతితో వారంతా బిక్కుబిక్కుమని ఉన్నారు. రామచంద్రరావుకు తండ్రి కృష్ణారావు, తల్లి లింగమ్మ ఉన్నారు. కోడల్ని తుపాకీతో హతమార్చడంతో వారు కూడా షాక్‌కు గురయ్యారు.


తల్లి మృతదేహం వద్ద దీనంగా చిన్నారులు

విచ్చలవిడిగా నాటు తుపాకీల వినియోగం

మన్యంలో నాటు తుపాకీల వినియోగం ఈమధ్యకాలంలో పెరిగింది. అడవి జంతువుల వేటకు వినియోగించే వీటిని కొన్ని సందర్భాల్లో విచక్షణ కోల్పోయి మనుషులపై ఎక్కు పెడుతున్నారు. తరచూ ఇటువంటి ఘటనలు మన్యంలో ఏదోకచోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇటువంటి ఘటనలకు మద్యం మత్తు కూడా మరోపక్క కారణమవుతోంది. నాటు తుపాకీతో మనుషుల ప్రాణాలను బలిగొనడం పోలీసు వర్గాలను సైతం కలవరపరుస్తోంది.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌కుమార్

సాక్షి, పాడేరు: ఉపాధ్యాయులు మరింత శ్రమించి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో జి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రమాణాలు, టెన్త్ విద్యార్థులకు అమలు చేస్తున్న కార్యాచరణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. నాడు–నేడులో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. బైజూస్ కార్యక్రమాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక విద్యాభివృద్ధికి రూ.కోట్లలో వెచ్చిస్తోందని, అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు శ్రమించాలని సూచించారు. పరీక్షలపై విద్యార్థులకు భయం పోయేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. టెన్త్ విద్యార్థులకు రోజువారీ ప్రత్యేక బోధన, పరీక్షలు నిర్వహించి నూరుశాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు.


శ్రీకృష్ణాపురం ఆశ్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌కుమార్

విదేశీయుల సందడి

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ఒనకడిల్లీలో గురువారం జరిగిన వారపు సంతలో, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం వద్ద వివిధ దేశాలకు విదేశీయులు సందడి చేశారు. వారపు సంతకు వచ్చిన అంద్రహల్, ఒనమనాల్ గ్రామాల బొండా జాతి ఆదివాసీ గిరిజనులతో వారు ఫొటోలు తీసుకున్నారు. వారి నుంచి పూసలు,కాండియాలు తదితర వస్తువులను కొనుగోలు చేశారు.మాచ్‌ఖండ్, ఒనకడిల్లి, డుడుమ,జోలాపుట్టు, జలవిద్యుత్ కేంద్రం, వించ్ హౌస్, డుడుమ జలపాతం ప్రాంతాలను ఫ్రాన్స్, లండన్, బ్రెజిల్, కెన్యా, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన వారు సందర్శించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్ పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు ఒక పొక్లెయిన్‌ను గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని పంట భూముల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం అనకాపల్లి మైన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో మూడు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్ర, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పాడేరు డివిజన్‌లోని 35 ఆరోగ్య కేంద్రాల వైద్యసిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్లకు శిక్షణ నిర్వహించారు. శిశు మరణాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు పట్టే విధానంపై అవగాహన కలిగించాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మన్యంలోని 35 ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పొందిన వారు పీహెచ్‌సీల పరిధిలో తోటి వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూవోలకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలింతలు బిడ్డలకు తల్లిపాలు ఆరు నెలల పాటు పట్టేలా వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. అనంతరం విశాఖ రీజనల్ ట్రెనింగ్ సెంటర్ (పిమేల్) ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాతె వైద్య బృందానికి తల్లిపాలు పట్టే విధానం, ఇతర అంశాలపై దృశ్య, శ్రవణ విధానంలో అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఇమ్యునైజేషన్ అధికారి ప్రభావతి, పీవోడీటీటీ భారతి, ఏడీఎంహెచ్‌వో కె.లీలాప్రసాద్, జిల్లా లెప్రసి,ఎయిడ్స్,టీబీ కంట్రోల్ అధికారి టి.విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతపై రూపొందించిన స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు

నేడే కోనేటిరాయుని కల్యాణం

- ఉపమాకలో ఘనంగా ఏర్పాట్లు
- అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు

నక్కపల్లి: కోనేటిరాయని కల్యాణానికి వేళయింది. ఉపమాక గరుడాద్రి పర్వతంపై ఏకశిలపై వెలసిన లోకేశుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి తిరుకల్యాణానికి గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, కంకణధారణ, అంతరాలయ దేవతాపూజ, మత్యంగ్రహణం నిర్వహించారు. స్వామివారి కల్యాణమండపంలో ఉభయ దేవేరులను ఉంచి, సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి ఉత్తర ఈశాన్య దిక్కు ప్రాంతానికి పుట్టమన్ను తెచ్చేందుకు తీసుకెళ్లారు. గరుడ ప్రాణప్రతిష్ఠ, విశేష హోమాలు, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనంటూ గురువారం ఉదయం పెండ్లి కావిడిని ఉపమాక మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



పెండ్లి కావిడిని మాడ వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

ఆలయానికి చేరిన ఆభరణాలు

స్వామివారికి కోట్లాది రూపాయల విలువైన స్వర్ణాభరణాలు ఉన్నాయి. వజ్రాలు, వైఢూర్యాలు, కెంపులు, పచ్చల హారం, కాసులపేర్లు, మరకత మాణిక్యాలు, పగడాలు, కటిహస్తం, వజ్రాల కిరీటం, గొలుసులు.. ఇలా రకరకాల ఆభరణాలు ఉన్నాయి. వీటిని భద్రతా కారణాల రీత్యా విశాఖలోని ట్రెజరీలో భద్రపరుస్తారు. ప్రతి ఏటా కల్యాణోత్సవాలకు తీసుకువచ్చి ఐదు రోజులపాటు అలంకరించి తిరిగి ఖజానాకు చేరుస్తారు. గురువారం భారీ బందోబస్తు మధ్య వీటిని ఆలయానికి తీసుకువచ్చారు.

దేశంలో మూడో స్థానంలో ఏపీ టూరిజం

ఎయిర్‌పోర్టులో పర్యాటక హెల్ప్ డెస్క్ ప్రారంభించిన మంత్రి రోజా



ఏపీ టూరిజం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

సాక్షి, విశాఖపట్నం: దేశంలో ఏపీ టూరిజం మూడో స్థానంలో ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. విశాఖ విమానాశ్రయంలో గురువారం ఆమె పర్యాటక హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాట్లు, హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించారు. కరోనా కారణంగా పర్యాటక రంగం దెబ్బతిందని.. జీఐఎస్ సదస్సు ద్వారా పర్యాటకానికి ఊతం లభిస్తుందన్నారు. తిరుపతి, విశాఖలో ఓబరాయ్ హోటళ్లు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. 26 జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రోజా మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 స్థానాలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తులు లేకుండా..ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు రెండుసార్లు డేట్ ఇచ్చి.. తన సినిమా షూటింగులు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి.. మా ప్రభుత్వంలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

సబ్‌ట్రెజరీలో కలెక్టర్ తనిఖీలు

క్షుణ్ణంగా రికార్డుల పరిశీలన

సాక్షి, పాడేరు: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ ట్రెజరీలోని పలు విభాగాలను సందర్శించారు. సుమారు గంటన్నర పాటు ఆయన సబ్ ట్రెజరీలో ఉండి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అవినీతి ఆరోపణలపై ఫిర్యాదు అందడంతో కలెక్టర్ తనిఖీ నిర్వహించినట్టు ప్రచారం జరుగుతోంది.

పలు రైళ్ల రీ షెడ్యూల్



విశాఖ: సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 5న ఎర్నాకుళంలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరాల్సిన ఎర్నాకుళం–టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ 3.30 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ నెల 5వ తేదీన ఉదయం ఆరు గంటలకు అలప్పుజలో బయలుదేరాల్సిన అలప్పుజ–ధన్‌బాద్(13352) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

ఉపాధి కల్పన లక్ష్యం

ఉపాధి కల్పన జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్‌కుమార్

అరకులోయ రూరల్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఉపాధి కల్పన నైపుణ్య జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక వైటీసీ శిక్షణ కేంద్రంతోపాటు ప్రభుత్వ ఐటీఐని గురువారం ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అర్హులైన నిరుద్యోగులకు హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్, హౌస్ కీపింగ్, ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నీషియన్లగా ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాలను గిరిజన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, టీవో శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ నవీన్‌కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

కశింకోట: అక్రమంగా తరలిస్తున్న గంజాయి ఆటోను పట్టుకొని ప్రజలు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని కన్నూరుపాలెంలో జరిగింది. రూ.లక్ష విలువైన 50 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి గురువారం అందించిన వివరాలివి. ఏటిగైరమ్మపేట నుంచి తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిని చేరుకోవడానికి బుధవారం రాత్రి వస్తున్న గంజాయితో వస్తున్న ఆటో కన్నూరుపాలెం వద్ద రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని ఢీకొనడంతో గాయపడ్డాడు. దీంతో ఆటోను స్థానికులు పట్టుకొని పరిశీలించగా దానిలో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కాపారపు నాగరాజును పట్టుకొని అరెస్టు చేశారు. ఆటోలో తరలిస్తున్న 50 ప్యాకెట్ల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆటోను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



గంజాయితో పట్టుబడిన ఆటో, డ్రైవర్ నాగరాజు

ఉచితంగా రాగి, ఉలవ విత్తనాలు

మాకవరపాలెం: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జేడీ మోహనరావు సూచించారు. తామరం రైతు భరోసా కేంద్రంలో అభ్యుదయ మహిళా రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకున్న భూమిలో కొంత విస్తీర్ణంలో చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. రాగి, ఉలవ విత్తనాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య రీత్యా చిరుధాన్యాల సాగు చేపట్టాలన్నారు. అనంతరం మహిళలకు అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్యసుధ, ఏవోలు విజేత, తులసి, చిరంజీవి పాల్గొన్నారు.




శిక్షణలో మాట్లాడుతున్న జేడీ మోహనరావు

బీసీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం: మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకులాల కన్వీనర్, నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి మార్చి 5 నుంచి ఏప్రిల్ 4లోపు https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. బాలురకు అనకాపల్లిలో 80, నర్సీపట్నంలో 40 సీట్లు, బాలికలకు తానాంలో 80, చోడవరంలో 40 సీట్లు ఉన్నట్టు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో గురువారం తెల్లవారుజామున లారీ ఢీకొనడంతో మహిళ మరణించింది. దేవవరం గ్రామానికి చెందిన పోలవరకు ముత్యాలమ్మ అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వచ్చేసింది. తెల్లవారు జామున ఒడ్డిమెట్ట సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తుండగా తుని నుంచి నక్కపల్లి వైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు గోవిందు ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.



ముత్యాలమ్మ మృతదేహం


వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 150వ కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. గిరిజాంబ కొండ దిగువన ఉన్న పుట్ట వద్ద పేరంటాలు, పెద్దల సమక్షంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు ఆరోగ్యం బాగుండకపోవడంతో అతని అన్నయ్య దొరబాబు కుమారుడు శ్రీరామ్, దేవస్థానం ఈవో శర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకుల సమక్షంలో వేడుకలు జరిగాయి. సన్నాయి మేళతాళాలు, డప్పులు, వాయిద్యాల నడుమ కొండపై నుంచి కొండ దిగువన ఉన్న పుట్ట వరకు ఊరేగింపుగా వచ్చి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పుట్టమన్నును మూకుడుతో తీసికొచ్చి ఆలయ ప్రాంతంలో ఉంచారు. పుట్ట మట్టిలో నవధాన్యాలు వేసి పూజలు చేశారు. మూకుడులో ఉంచిన నవధాన్యాల్లో ఏ రకం విత్తనాలు బాగా మొలకెత్తుతాయో చూసి ఈ ఏడాది ఆ రకం పంటలు బాగా పండుతాయని రైతుల విశ్వాసం. శుక్రవారం వేంకటేశ్వరస్వామికి మండపంలో వేడుకగా కల్యాణం నిర్వహించడానికి దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

స్వామీజీ గోపూజ

నూకాంబికను దర్శించిన కంచి కామకోటి పీఠాధిపతి

తుమ్మపాల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని కంచి కామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి స్వామి గురువారం దర్శించుకొని పూజలు చేశారు. 300 కేజీలతో తయారు చేసిన అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఆవిష్కరించి తొలిపూజ చేశారు. ఆలయ మండపంలో భక్తులను స్వామిజీ ఆశీర్వదించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. స్వామిజీని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న శంకరవిజయేంద్ర సరస్వతి స్వామి

K9 ప్రత్యేక డాగ్ స్క్వాడ్

- రాష్ట్రంలో తొలిసారి విశాఖలో ఏర్పాటు
- జీఐఎస్‌లో భద్రతకు 13 పోలీస్ జాగిలాలతో తనిఖీలు
- మూడు కేటగిరీలుగా విభజన



దొండపర్తి: ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ పోలీస్ శాఖ పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు పలువురు కేంద్రమంత్రులు, దేశంలోని దిగ్గజ పారిశ్రామికవేత్తలు, దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆహ్వానించేందుకు నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టింది. వీవీఐపీలు, వీఐపీలతో పాటు ఇతర ప్రతినిధుల రక్షణ కోసం 2,500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసింది. నగరంలో ప్రధాన జంక్షన్లు, ప్రాంతాల్లో పికెటింగ్‌లు పెట్టడంతో పాటు సభా ప్రాంగణం, ప్రముఖులు బస చేసే హోటళ్లు, రిసార్టుల వద్ద మూడంచెల భద్రతా విధానంతో పటిష్ఠ నిఘా పెట్టింది. అలాగే రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా తొలిసారిగా విశాఖలో ప్రత్యేకంగా 'కే9 స్క్వాడ్'ను ఏర్పాటు చేసి రంగంలోకి దింపింది. జీఐఎస్‌లో ప్రముఖుల భద్రత సేవల కోసం 13 పోలీస్ జాగిలాల బృందంతో నగరంలో అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతోంది.

మూడు జాతులతో ప్రత్యేక బృందం

రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ పోలీసులు 'కే9 స్క్వాడ్' పేరుతో స్నిఫర్ డాగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. లాబ్రడార్, డాబర్‌మాన్, జర్మన్ షెపర్డ్ వంటి మూడు జాతుల జాగిలాలతో జీఐఎస్‌లో తనిఖీలకు ఓ బృందాన్ని సిద్ధం చేశారు. జాగిలాల హ్యాండ్లర్లైన సిబ్బందికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ కేటాయించారు. ఇందులో గ్రేసీ, మార్టిన్, రియో, జానీ, రాకీ, యోధా, బ్లాకీ, బ్రూటస్, బిట్టు, సీజర్, లక్కీ, రూబీ, జాకీ పేర్లతో ఏడు ఆడ జాగిలాలతో పాటు మొత్తం 13 ఉన్నాయి. వీటిలో రూబీ జర్మన్ షెపర్డ్ కాగా, జాకీ, సీజర్‌లు డాబర్‌మాన్ జాతికి చెందినవి. మిగిలినవన్నీ లాబ్రడార్లు. అలాగే ఇతర జిల్లాల నుంచి మరో 14 స్నిఫర్ డాగ్స్‌ను కూడా రప్పించి తనిఖీలు చేపడుతున్నారు.

తనిఖీల్లో జాగిలాల పాత్ర కీలకం

భద్రత సిబ్బంది తనిఖీలో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకం. కేవలం పేలుడు పదార్థాలను మాత్రమే కాకుండా కొన్ని కేసుల్లో నిందితుల అన్వేషణ, నార్కోటిక్స్‌ను గుర్తించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఇవి మనుషుల కంటే 40 రెట్లు మెరుగ్గా వాసన పసికట్టే గుణం కలిగి ఉంటాయి. ప్రతి 20 నిమిషాల పనికి ఒక్కో జాగిలానికి 10 నిమిషాలు విశ్రాంతి ఇస్తారు. అత్యంత క్రమశిక్షణతో అనేక కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ జాగిలాలతో ప్రత్యేక ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ నిర్ణయించారు. దీంతో కే9 పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వాస్తవానికి నాలుగు పదునైన కోరలు కలిగిన జాగిలాలను కెనైన్స్‌గా సంబోధిస్తారు. దీంతో ఆ పేరునే కాస్త ట్రెండీగా కే9గా పిలుస్తున్నారు. ఈ కే9 స్క్వాడ్‌లో బాంబ్ డిటెక్షన్, ట్రాకర్స్, నార్కోటిక్స్ మూడు కేటగిరీలు ఉన్నాయి. ఈ బృందం ఇప్పటికే సభా ప్రాంగణం వద్దే కాకుండా వీవీఐపీలు బస చేసే ప్రాంత పరిసరాల్లో కూడా తనిఖీలు చేపడుతోంది.